31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం,అక్టోబర్ 30 , 2026 పేజీలు : 8

ఆయిల్ పామ్, ఆరుతడి పంటల సాగును పెంచాలి

కలెక్టర్ చిత్రా మిశ్రా

చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 29 : ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి చేపట్టడం ఎంతో అవసరమని, నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు, దీర్ఘకాలిక లాభాలనిచ్చే ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. మండలంలోని ఘన్ముక్ల, పోతిరెడ్డిపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్, కూరగా యల తోటలను గురువారం ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.?ఈ సందర్భం గా సాగు చేస్తున్న రైతులు గుడిపాటి శివారెడ్డి, మాడ సమ్మిరెడ్డి, కారుపాకల శ్రీనివాస్‌లతో కలెక్టర్ మాట్లాడారు. విత్తనాలు, ఎరువుల వినియోగం, డ్రిప్ ఇరిగేషన్, ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సిడీలు, మార్కెటింగ్ తదితర వివరాలను -మిగతా 2లో

చెత్త నిర్వహణలో ఆధునిక విధానాలు అవలంబించాలి

జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 29: చెత్త నిర్వహణలో ఆధునిక విధానాలు అవలంబించాలని, మార్పు మన నుంచే ప్రారంభం కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.గురువారం పురపాలక కార్యాలయంలో చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం జరుగగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా తడి, పొడి చెత్త వేరు సేకరణ, శాస్త్రీయ ప్రాసెసింగ్, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిం చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్త సమస్య జగిత్యాలకే కాదు ధర్మపురి, కరీంనగర్ లోనూ ఉందని, ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పొగ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అ న్నారు. ఆధునిక యంత్రాలు, బేలర్లు, ఇంటర్మీడియట్ కలెక్షన్ పాయింట్ల విని యోగంతో శాశ్వత పరిష్కారం చూపా లని సూచించారు. ఇందుకు ధరూర్ క్యాంపులో స్థలం కేటాయించినట్లు తెలిపారు.99 రోజుల ప్రజాపాలనలో పారిశుద్ధ్య అవగాహనకు కేంద్ర గుర్తింపు లభించిందని కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. సమావేశంలో కోదండరామాలయం-మిగతా 2లో

2027 గోదావరి పుష్కరాలకు

పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్
- మంథని పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనులకు రూ.23 కోట్లు మంజూరు
- రూ.10 కోట్లతో ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం గౌతమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం
- కాశీ తరహాలో మంథనిలో ప్రతిరోజూ సాయంత్రం గోదావరికి సప్త హారతులు
- ఓదెల, రామగుండం ప్రాంతాల్లోనూ చిన్న పుష్కర ఘాట్ల ఏర్పాటు
- మార్చి చివరి నాటికి పుష్కర ఘాట్ పనులు పూర్తి చేసేలా చర్యలు

చురకలు (మంథని,పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్, అక్టోబర్ 29 : 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతోందని దేవాదాయ శాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ తెలి పారు. పుష్కరాలకు మరో ఎనిమిది నెలల గడువు మాత్రమే ఉన్నందున అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేందుకు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.గురువారం దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమం తరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల పురోగతిని, ఆలయ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ మాట్లాడుతూ, 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు. మంథనిలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున టైర్-1 కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.మంథని పుష్కర ఘాట్ పునర్నిర్మాణం, విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.23 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పుష్కర ఘాట్‌ను విస్తరించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మంథనిలో కాశీ తరహాలో ప్రతిరోజూ సాయంత్రం గోదావరి నదికి సప్త హారతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.పుష్కరాలకు-మిగతా 2లో

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల , అక్టోబర్ 29 : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండలం మూడపెల్లిలో టీ జీ ఈ డబ్ల్యూ ఐ డీ సీ ఆద్వర్యంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం పనులు కొనసాగుతుండగా, కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఆవరణలో నిర్మాణ పను లు కొనసాగుతుండగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులకు పలు సూచ నలు చేశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అధికారు లు ప్రణాళిక ప్రకారం పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురా వాలని సూచించారు.వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో

'ఇందిరమ్మ' ఇళ్ల మాయాజాలం

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 29 : అర్హులైన నిరుపేదలకు పక్కా గూడు కల్పించాలనే ప్రభుత్వ ఆశయాన్ని కొందరు స్వార్థపరులు, అధికారుల ఉదాసీనత కలిసి నీరుగారుస్తున్నాయి. హుజూరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డులో న్యాయస్థానం ఇంజంక్షన్ (యథాతథ స్థితి) ఉత్తర్వులు అమల్లో ఉన్న భూమిలోనే 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు కావడం, దాన్ని అడ్డం పెట్టుకుని పక్కవారి ప్రైవేట్ స్థలంలోనూ అక్రమ నిర్మాణాలు చేపడుతుండటం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

పత్రాలు లేవు.. పరిశీలన శూన్యం!

స్థానిక 9వ వార్డులోని వివాదాస్పద సర్వే నంబర్ స్థలంపై గతంలోనే న్యాయస్థానం ఇంజంక్షన్ ఆర్డర్ జారీ చేసింది. రెవెన్యూ, మున్సిపల్ రికార్డులను పరిశీలిస్తే ప్రస్తుతం అక్కడ నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి గానీ, ఆమె కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి యాజమాన్య హక్కులు లేవు. ఎలాంటి హక్కు పత్రాలు లేని పరాయి స్థలంలో ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ ఎలా జారీ చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఏ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేశారు? క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా ఏ అధికారి ఓకే చెప్పారు? అనే విషయాలపై స్పష్టత కరువైంది.

రిజిస్ట్రేషన్ స్థలంలోకి చొరబాటు.. బాధితుల ఆవేదన

కోర్టు ఆదేశాలను దిక్కరించడమే కాకుండా, పక్కనే చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రైవేట్ వ్యక్తుల పట్టా స్థలాల్లోకి చొచ్చుకెళ్లి పిల్లర్లు వేసి భవన నిర్మాణ పనులు వేగవంతం చేశారు. కష్టార్జితంతో కొనుగోలు చేసుకున్న స్థలం కళ్లెదుటే ఆక్రమణకు గురవుతోందని -మిగతా 2లో

ఎల్లారెడ్డిపేటలో ఎక్సైజ్ శాఖ దాడులు

-ఆరు లీటర్ల నాటుసారా స్వాధీనం

-ఇద్దరిపై కేసులు

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 29 : ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టే చర్యల్లో భాగంగా గురువారం గొల్లపల్లి, తిమ్మాపూర్, అల్మాస్‌పూర్,అక్కపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు.ఈ దాడుల్లో నారాయణపూర్ గ్రామంలో రెండు నాటుసారా కేసులను గుర్తించి,ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం.వారి వద్ద నుంచి మొత్తం ఆరులీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని సంబంధిత చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మోహసిన్, కానిస్టేబుళ్లు మారుతి,వర్మ ఈ దాడుల్లో పాల్గొన్నారు.మండలంలో అక్రమ నాటుసారా తయారీ,విక్రయాలపై నిఘా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

చెత్త నిర్వహణలో ఆధునిక విధానాలు అవలంబించాలి

మొదటి పేజీ తరువాయి.... వద్ద ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, ఎల్ఈడీ లైట్లు, తాగునీటి పైప్ లైన్ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అనారోగ్యంతో కోమాలో ఉన్న 2వ వార్డు అధికారికి వైద్య సహాయంగా కౌన్సిలర్లు తమ ఒక నెల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్, కమిషనర్ కె.సత్యప్రణవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో 'ఇందిరమ్మ' ఇళ్ల మాయాజాలం

మొదటి పేజీ తరువాయి....బాధితులు ఆధారాలతో పురపాలక కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

అధికారుల వైఖరిపై విస్మయం

ఈ అక్రమ నిర్మాణంపై పురపాలక కమిషనర్‌ను వివరణ కోరగా విచిత్రమైన సమాధానం ఎదురైంది. ప్రస్తుతం అది ఇందిరమ్మ ఇల్లు పేరుతో నమోదై ఉందని, నిబంధనల ప్రకారం రెండు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అయితే సదరు స్థలం నిషేధిత (ప్రొహిబిటెడ్) ఆస్తుల జాబితాలో ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ, నిషేధిత భూమిలో ఉన్న స్థలానికి జియో-ట్యాగింగ్ ఎలా సాధ్యమైంది, ప్రొసీడింగ్స్ ఎలా జారీ అయ్యాయో అధికారుల వద్ద సరైన సమాధానం లేదు. నిర్మాణం పూర్తయ్యేంత వరకు నోటీసుల పేరుతో కాలయాపన చేస్తారా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

సమగ్ర విచారణకు బాధితుల డిమాండ్

ఇందిరమ్మ పథకం ముసుగులో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి, ప్రైవేట్ భూములను ఆక్రమిస్తున్న ఈ వ్యవహారంపై కరీంనగర్ జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తప్పుడు పత్రాలతో మంజూరు పొందిన వారిపై, బాధ్యులైన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతున్నారు.

రామకృష్ణ స్కూల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

చురకలు విలేఖరి,జగిత్యాల, అక్టోబర్, 29 : ఎమ్మార్పీఎస్. జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జగిత్యాల విద్యాధికారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకులు దుమాల గంగారాం మాదిగ మాట్లాడుతూ జగిత్యాల పట్టణ కేంద్రంలోని రామకృష్ణ స్కూల్ చదువుకుంటున్న విద్యార్థి 30,వేల రూపాయల స్కూల్ ఫీజు కట్టాలని విద్యార్థి పేరెంట్స్ ను డిమాండ్ చేయడం జరిగింది 30,వేల రూపాయలు మా వద్ద ఈ పరిస్థితుల్లో లేవు మాకు కొంత సమయం కావాలని విద్యార్థి తల్లిదండ్రులు చెప్పిన 30, వేల రూపాయ లు మీరు ఫీజు చెల్లించక పోతే మీ కొడుకును ఎగ్జామ్ రాయనియ్యము అని చెప్పి నారు. ప్రస్తుతం రూ.6000 ఫీజుచెల్లిస్తే ఎగ్జామ్ రాయస్తామని రామ కృష్ణ స్కూల్ యాజమాన్యం చెప్పడంతో విద్యార్థి తల్లి దండ్రులు 6000 కట్టినారు. 6000, రూపాయల ఫీజు తీసుకొని కూడా విద్యార్థి ఎక్సమ్ రాయనివ్వకుండా విద్యార్థి మానసికంగా బాధపడడం చూసిన తల్లిదండ్రులు వెళ్లి స్కూల్ యజమాన్యంతో మాట్లాడగా విద్యార్థి తండ్రి మమ్ములను బూతులు తిట్టినాడు చెప్పి విద్యార్థి తండ్రి పై పిటిషన్ ఇవ్వగా కేసు నమోదు చేసినట్టు తెలుస్తా ఉందని జిల్లాలో ఉన్నటు వంటి ప్రైవేట్ స్కూళ్లలో స్కూల్ ఫీజు చెల్లించక పోయినచో విద్యార్థులను ఎగ్జామ్ రాయకుండా ఆపడం విద్య నిబంధనలో ఎక్కడ లేదని వాపోయారు.

2027 గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి.... వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.

ఓదెల, రామగుండంలోనూ పుష్కర ఘాట్లు

గోదావరి పుష్కరాల సందర్భంగా మంథనితో పాటు చిన్న ఓదెల, రామగుండం ప్రాంతాల్లోనూ చిన్న పుష్కర ఘాట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలకు వచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రూ.10 కోట్లతో గౌతమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం

మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని రూ.10 కోట్ల వ్యయంతో ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడుతున్నట్లు వివరించారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.పుష్కరాలకు మరో 8 నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున పనుల్లో జాప్యం జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మంథని పుష్కర ఘాట్ పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంట్రాక్టర్ ఎంపిక కూడా పూర్తయినందున త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్, ఆరుతడి పంటల సాగును పెంచాలి

మొదటి పేజీ తరువాయి....అడిగి తెలుసుకుని, తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని వారిని అభినందించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నందున రైతులు వరి పంట జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు, కూరగాయలు, పప్పుదినుసులు సాగు చేసి మంచి లాభాలు గడించవచ్చని సూచించారు. మండలాల వారీగా అనుకూలమైన పంటలపై ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన కూరగాయలను స్థానిక రైతుల నుంచే కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి, డీహెచ్ఎస్ఓ జగన్మోహన్ రెడ్డి, ఆయిల్ ఫెడరేషన్ డీఎం రోహిత్, ఏడీఏ సునీత, హార్టికల్చర్ ఆఫీసర్ మధులిక, తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోసం ఏళ్లుగా కష్టపడుతున్నా.. గుర్తింపు ఏదీ?

-బొప్పాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి కూడా దక్కలేదు

-దివ్యాంగ కాంగ్రెస్ కార్యకర్త మేడిశెట్టి రాజశేఖర్ ఆవేదన

- వేములవాడ దేవస్థానం కమిటీలోనైనా అవకాశం కల్పించండి

- కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 29 : కాంగ్రెస్ పార్టీ కోసం తాను, తన తండ్రి మేడిశెట్టి దేవచంద్రం అనేక ఏళ్లుగా కష్టపడుతున్నా, పార్టీ పరంగా తగిన గుర్తింపు లభించడం లేదని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగ కాంగ్రెస్ కార్యకర్త మేడిశెట్టి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం తమ కుటుంబం చేసిన సేవలను గుర్తించకుండా, ఇటీవల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకంలో కనీసం డైరెక్టర్ పదవి కూడా కల్పించకపోవడంపై స్థానిక కాంగ్రెస్ నాయకుల వైఖరిని ఆయన ప్రశ్నించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే తనలాంటి కార్యకర్తలకు గుర్తింపు ఎప్పుడు లభిస్తుందని ఆవేదనతో ప్రశ్నించారు.తనకు పార్టీ లేదా ప్రభుత్వంలో తగిన బాధ్యత కల్పించి ప్రజాసేవ చేసే అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని రాజశేఖర్ కోరుతున్నారు. బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో అవకాశం కల్పించలేకపోయినప్పటికీ, వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలిలో డైరెక్టర్‌గా లేదా మరేదైనా నామినేటెడ్ పదవిలో అవకాశం కల్పించి దివ్యాంగుడినైన తనను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

తండ్రి నుంచి తన వరకు.. కాంగ్రెస్‌తోనే ప్రయాణం.

రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన తండ్రి మేడిశెట్టి దేవచంద్రం 2010 నుంచి 2020 వరకు వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ పదవిలో ఉన్న సమయంలో గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కు మద్దతు పెంచేందుకు కృషి చేశారని రాజశేఖర్ తెలిపారు.తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన కాంగ్రెస్ అనుబంధాన్ని తాను కూడా కొనసాగిస్తున్నానని, పార్టీ సిద్ధాంతాలు, నాయకుల కార్యక్రమాలు, ప్రజా సమస్యలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నానని చెప్పారు. శారీరక వైకల్యం ఉన్నప్పటికీ తనకు సాధ్యమైన మార్గాల్లో పార్టీ కోసం పనిచేస్తున్నానని వివరించారు.

గ్రామ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించాలి.

వెంకటాపూర్ గ్రామ అభివృద్ధి కోసం తమ కుటుంబం కాంగ్రెస్ నాయకుల సహకారంతో పలు ప్రయత్నాలు చేసిందని రాజశేఖర్ పేర్కొన్నారు. మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేశామని, అనంతరం ఆయన చేతుల మీదుగా వాటర్ ప్లాంట్ ప్రారంభమైందని తెలిపారు.అలాగే, గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన శ్రీధర్ బాబు సహకారంతో గ్రామంలో ఐకేపీ గోదాం మంజూరుకు కృషి చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు, రైతులకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పన కోసం తమ కుటుంబం చేసిన ప్రయత్నాలను పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

రైతుల కోసం పోరాడితే.. కేసుల చుట్టూ తిరగాల్సి వచ్చింది.

తన తండ్రి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారని రాజశేఖర్ తెలిపారు. ఈ ఆందోళన నేపథ్యంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమ కుటుంబంపై కేసు నమోదైందని, అది కక్షపూరిత చర్యగా భావిస్తున్నామని ఆరోపించారు.ఆ కేసు కారణంగా ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల కోసం పోరాడిన తమ కుటుంబం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీని వీడకుండా పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నామని తెలిపారు.

మెట్‌పల్లి మున్సిపల్ సమావేశం రద్దు

-చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలపై కౌన్సిలర్ల ఆగ్రహం
-అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష
-జనరల్ ఫండ్ చెక్కుల విడుదలపై నిరసన
-22 మంది కౌన్సిలర్ల వాకౌట్‌తో సమావేశం రద్దు

చురకలు విలేకరి మెట్‌పల్లి, అక్టోబర్ 29 : మెట్‌పల్లి మున్సిపాలిటీ లో గురువారం నిర్వహించిన సాధారణ సమావేశం కౌన్సిలర్ల వాకౌట్‌తో రద్దయింది. మున్సిపల్ ఛైర్మన్ మైలారపు లింబాద్రి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పాటు స్వతంత్ర కౌన్సిలర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని, జనరల్ ఫండ్ చెక్కుల విడుదల విషయంలోనూ తమకు అన్యాయం జరుగుతోందని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లో అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని, నిధుల కేటాయింపులో పారదర్శకత పాటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే వివిధ పార్టీలకు చెందిన 22 మంది కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. దీంతో సాధారణ సమావేశం రద్దయింది. ప్రజా సమస్యల పరిష్కారం, వార్డుల అభివృద్ధి లక్ష్యంగా సాగాల్సిన మున్సిపల్ సమావేశం రాజకీయ విభేదాలు,నిధుల కేటాయింపుపై అసంతృప్తితో రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్ల అభ్యంతరాలపై మున్సిపల్ పాలకవర్గం ఏ విధంగా స్పందిస్తుంది.? అభివృద్ధి నిధుల కేటాయింపులో పారదర్శకతకు ఎలాంటి చర్యలు తీసుకుంటుంది.? అనేది వేచి చూడాలి.

పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోంది

-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 29 : పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల పట్టణంలోని 33వ వార్డుకు చెందిన కుక్కల అఖిల భర్త శ్రీకాంత్ కు మంజూరైన రూ.1,06,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అవసరమైన సమయంలో తోడుగా ఉంటుందని, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత రాముకుమార్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమానికి చేయూత

చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 29 : జగిత్యాల పట్టణంలోని రాజేశు నిగుట్టలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి జాబితాపూర్ గ్రామానికి చెందిన గూడూరి లక్ష్మి, గజేందర్ దంపతులు చేయూతనందించారు.ప్రస్తుతం గోవిందపల్లి బృందావన్ అపార్ట్ మెంట్ లో ఉంటున్న వారు శీతాకాలం దృష్ట్యా ఆశ్రమంలోని ముగ్గురు మహిళలు, ఐదుగురు పురుషులకు చలి దుస్తులు అవసరమని తెలుసుకుని బుధవారం అంగీలు పంపిణీ చేశారు. అదే విధంగా వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంకా ఎవరైనా అనాథ వృద్ధులు ఉంటే తమ ఆశ్రమంలో చేర్చుకుంటామని తెలిపారు. జన్మదినం, వివాహ వార్షికోత్సవం, పెద్దల జయంతి, వర్ధంతి సందర్భాల్లో ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో జరుపుకుని భోజన సదుపాయం కల్పించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రంగు రాజయ్య, మేనేజర్ మోటూరి నాగలింగం పాల్గొన్నారు.

కేజీబీవీలో పోక్సో చట్టంపై అవగాహన

చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 29 : జగిత్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్టా విద్యార్థినులకు పోక్సో చట్టం 2012పై అవగాహన కల్పించి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు రూపొందించిన ప్రత్యేక చట్టమే పోక్సో అని, ఈ చట్టంలో కఠిన నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అనుచితంగా తాకడం, అసభ్య ప్రవర్తన, ఆన్ లైన్ లో అసభ్య సందేశాలు వంటివి ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు చెప్పాలని సూచించారు. బాధిత పిల్లల గోప్యతను కాపాడటం, బాలల అనుకూల వాతావరణం కల్పించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

-ధర్మపురి కోర్టు న్యాయమూర్తి వై జానకి

చురకలు విలేకరి,ధర్మపురి, అక్టోబర్ 29 : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంలో పోలీస్ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాలని, అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని ధర్మపురి కోర్టు న్యాయమూర్తి వై. జానకి పిలుపునిచ్చారు.గురువారం కోర్టులో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జడ్జి జానకి పోలీసు అధికారులతో పలు కీలక అంశాలపై చర్చించారు.పెండింగ్ కేసులు,నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, కోర్టుకు సాక్షుల ను సకాలంలో హాజరయ్యేలా చూడటం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంనర్సింహ రెడ్డి, ఎస్సైలు సదాకర్, శ్రీకాంత్,ఎక్సైజ్ ఎస్సై జమీల్, కోర్ట్ డ్యూటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగదేవుపేటలో కేతి బచావో అవగాహన

చురకలు, విలేఖరి,వెల్గటూర్, అక్టోబర్ 29 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవుపేటలో గురువారం మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ అధ్యక్షతన కేతిబచావో (సాగు భూమి సంరక్షణ) అవగాహన కార్యక్రమం జరిగింది.ఫర్టిలైజర్ భూసార పరీక్షల ఆధారంగా వాడాలని,నానో యూరియా వాడకం పెంచడం, ప్రకృతి సాగు ప్రోత్సహించడం, పంట కోసిన తరువాత కొయ్యలను కాల్చకుండా జంతువులకు మేతగా లేదా భూమిలో కలియదున్నాలని, ఎల్నినో దృష్ట్యా రోబోయే యాసంగికి వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం జగదేవుపేటలో ఆయిల్ పామ్ పంటలని సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జగదేవుపేట సర్పంచ్ తిరుపతి,ఉపసర్పంచ్ గంగయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి రవళి,పంచాయతీ కార్యదర్శి వెంకటేష్,రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 29 : మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, అల్పాహార పథకాన్ని వంట కార్మికులతోనే నిర్వహించాలని, విధి విధానాలు ప్రకటించాలని, గ్యాస్, వంట సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా విన్న ఎమ్మెల్యే ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా సంకటహార చతుర్థి పూజలు

చురకలు విలేకరి, ధర్మపురి, అక్టోబర్ 29 : ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల శ్రీ గణపతికి సంకష్టహర చతుర్థి ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి గణపతి ఉపనిషత్తులతో , మన్య సూక్తంతో అభిషేకం హారతి మంత్రపుష్పం కార్యక్రమంలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్ , సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి , వేద పండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ , ఓంకార శర్మ , అభిషేకం పురోహితులు బొజ్జా సంతోష్ కుమార్, రాజగోపాల్ అర్చకులు ద్యావల్ల విశ్వనాథ శర్మ , సాయికుమార్ అదిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

-జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ

చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 29 : భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిర్వహించి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రసూనాంబ అధికారులను ఆదేశించారు.రాయికల్ మండలంలోని ఉప్పు మడుగు గ్రామంలో కొన సాగుతున్న భూముల రీ సర్వే ప్ర క్రియను గురువారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇప్పటి వరకు చేపట్టిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూముల విస్తీర్ణం,సర్వే నెంబర్లు,గ్రామ సరిహద్దులు, గ్రామ కంఠం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. అనంతరం తాహసిల్దార్ కార్యాలయం తనిఖీల్లో భాగంగా సర్ ప్రక్రియ, భూభారతి, ప్రజావాణి,భూ సర్వే, భూ,మీసేవ సమస్యలు, ఫిర్యాదులపై వివరాలు అడిగి తనిఖీ చేశారు. వీరి వెంట తహసీల్దార్ నాగార్జున, జిపిఓలు దాస్ కుమార్, రాజేందర్,లైసెన్స్ సర్వేయర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

రామకృష్ణ స్కూల్‌కు నోటీసులు

-ఫీజు బకాయి కారణంగా విద్యార్థినిని పరీక్షకు అనుమతించలేదన్న ఆరోపణలు

చురకలు ప్రతినిధి, జగిత్యాల,అక్టోబర్ 29 : ఫీజు బకాయి కారణంగా రెండో తరగతి విద్యార్థినిని పరీక్షకు అనుమతించలేదన్న ఆరోపణలపై జగిత్యాల విద్యాశాఖ స్పందించింది.ఈ ఘటనపై న్యూస్ ఛానల్‌లో ప్రసారమైన వార్తల నేపథ్యంలో జిల్లా విద్యాధికారి మౌఖిక ఆదేశాల మేరకు సంబంధిత రామకృష్ణ ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.ఈ ఘటనపై రెండు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ అందజేయాలని విద్యాశాఖ అధికారులు పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు.పాఠశాల నుంచి వచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.అయితే అధిక ఫీజులు వసూలు చేస్తోందని ఈ విద్యాసంస్థపై ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేజీబీవీలో విద్యార్థులతో మమేకమైన ఎమ్మెల్యే

-విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షించిన ఎమ్మెల్యే

చురకలు విలేకరి,మల్లాపూర్,అక్టోబర్ 29 : మల్లాపూర్ మండల కేంద్రంలోని కేజీబీ విద్యాలయాన్ని కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల డా.సంజయ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఉపాధ్యాయుడి పాత్రలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసం, విద్యాలయంలో పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణం, వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ప్రిన్సిపల్ శ్రీలత, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ముద్దం శరత్ గౌడ్, బండి లింగస్వామి గౌడ్, కదుర్క నర్సయ్య, మ్యకల సతీష్, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

-రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి

-మూడు మండలాలకే కరువు పరిమితం చేయడం అన్యాయం

-తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గుంజ పడుగు హరిప్రసాద్

చురకలు ప్రతినిధి,కరీంనగర్, అక్టోబర్ 29 : ఎల్ నినో ప్రభావంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒకవైపు చెబుతూనే, మరోవైపు కరువు పరిస్థితులను అధికారికంగా గుర్తించి రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ గురువారం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు.పంటలు ఎండిపోయి, పెట్టుబడులు చేతికందక రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవడం సరికాదని వారు అన్నారు.కరీంనగర్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని రైతులు కోరుతుంటే, ప్రభుత్వం కేవలం కరీంనగర్ పట్టణం, కరీంనగర్ రూరల్, హుజురాబాద్ ప్రాంతాలను మాత్రమే కరువు మండలాల జాబితాలో చేర్చడంతో మిగిలిన మండలాల రైతాంగానికి తీవ్ర అన్యాయం చేయడమేనని. మిగతా ప్రాంతాల్లోని రైతుల కష్టాలను పట్టించుకోకుండా కేవలం మూడు మండలాలకే పరిమితం చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం, సాగునీటి ఇబ్బందులు, పంటల ఎండిపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని. వ్యవసాయం కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు చేతికి రాక ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని. ఇలాంటి పరిస్థితుల్లో రైతులందరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని. కరువు మండలాల ఎంపికలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల నష్టం, వర్షపాతం, సాగునీటి లభ్యత, రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను సమగ్రంగా పరిశీలించి న్యాయంగా నిర్ణయం తీసుకోవాలని కేవలం కొన్ని ప్రాంతాలను మాత్రమే గుర్తించి, మిగతా ప్రాంతాల రైతులను సహాయానికి దూరం చేయడం తగదని వారు అన్నారు.కరీంనగర్ జిల్లాలోని కరువు పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి జిల్లా మొత్తాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించాలి. కేవలం మూడు మండలాలకే పరిమితం కాకుండా, జిల్లాలోని అన్ని మండలాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలి. పంట నష్టపోయిన రైతులను గుర్తించి అర్హులైన ప్రతి రైతుకూ న్యాయమైన పరిహారం అందించాలి. వ్యవసాయ రుణాలు, పంటల సాగు ఖర్చులు, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలి. కరువు పరిస్థితులపై పారదర్శకంగా వ్యవహరించి, రైతులకు అందాల్సిన ప్రభుత్వ సహాయాన్ని ఎలాంటి వివక్ష లేకుండా అందించాలి. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతాంగాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. కరీంనగర్ జిల్లాలోని రైతులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి, కరువు పరిస్థితులపై పునఃసమీక్ష చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోందని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.రైతుల కష్టాలను విస్మరిస్తే తెలంగాణ రక్షణ సేన రైతాంగం పక్షాన పోరాటం చేస్తుందని. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి రైతుల కన్నీళ్లు తుడిచే చర్యలు చేపట్టాలి. కరీంనగర్ ను కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలి తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.విలేకరుల సమావేశంలో జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి కుతాడి శ్రీనివాస్, నియోజకవర్గం మహిళ విభాగం అధ్యక్షురాలు బశెట్టి కృష్ణవేణి, జిల్లా పార్టీ నాయకులు శ్రీరాముల రమేష్, మడిపల్లి వినీత్, జంగ అపర్ణ తదితరులు ఉన్నారు.

కరెంట్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్ వైర్

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

-8 దొంగతనం కేసుల్లో నిందితులు

-మూడు కరెంట్ మోటార్లు, ఆటో స్వాధీనం

చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, అక్టోబర్ 29 : కరీంనగర్ రూరల్ పోలీసులు కరెంట్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు కరెంట్ మోటార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ లోని వాల్మీకి నగర్ చెందిన సాయికుమార్, ప్రస్తుతం కొత్తపల్లి మండలంలోని బదిపల్లి గ్రామం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు.ఈయనతో పాటు సుభాష్ నగర్ కు చెందిన వజీద్ పాషా లు వీరిద్దరూ ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు.

నిందితులు చేసిన నేరాల వివరాలు:

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, నిందితులు ఇద్దరూ కలిసి రాత్రి సమయాల్లో ఆటోలో తిరుగుతూ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను, వ్యవసాయ బావుల వద్ద ఉన్న కరెంట్ మోటార్లను దొంగిలించేవారు. అనంతరం వాటిని గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించి, వచ్చిన డబ్బును జల్సాలకు ఖర్చు చేసేవారు.ఇటీవల కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా కరెంట్ మోటార్ల దొంగతనాలు జరుగుతుండటంతో, పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా, వారు నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు.వీరిపై కరీంనగర్ రూరల్,కొత్తపల్లి, మానకొండూరు మండలాలు తదితర పోలీస్ స్టేషన్లలో మొత్తం 8 దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుండి మూడు కరెంట్ మోటార్లు, దొంగతనాల కు ఉపయోగించిన ఒక ఆటో నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు. దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన వ్యక్తుల వివరాల కోసం దర్యాప్తు కొనసాగుతోంది.ఈ అరెస్టులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినారు.

నీటి పొదుపుపై ప్రత్యేక దృష్టి : చైర్మన్ కావ్య

చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 29 : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పట్టణంలో తాగునీటి వినియోగం, పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సూచించారు. నీటి వృథాను అరికట్టి, భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం,

మౌలిక వసతులు, వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ, నీటి వనరులను సంరక్షించడంతో పాటు ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి వార్డులో కౌన్సిలర్లు ప్రజలను చైతన్యపరచి, నీటిని బాధ్యతాయుతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, ఇతర మౌలిక వసతుల సమస్యలను ప్రస్తావించారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను పటిష్ఠం చేయడంతో పాటు తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పురపాలక సేవలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. రవిబాబు, మేనేజర్ మారుతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

నవంబర్ 1న న్యూఢిల్లీలో జరిగే

భారీ ధర్నాకు కాంగ్రెస్ శ్రేణులు తరలి రావాలి

-టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి

చురకలు ప్రతినిధి,హైదరాబాద్ , అక్టోబర్, 29 : ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ ఏఐసిసి ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో చేపట్టనున్న భారీ ధర్నాకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ల పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన పౌరుల ఓటు హక్కులకు ఎలాంటి విఘాతం కలగకుండా పారదర్శకమైన విధానాలను అనుసరించాలని, ఓటర్ల జాబితాలో మార్పులు, ఓటర్ల సంఖ్యలో వ్యత్యాసాలపై ప్రజలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమనీ, దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కు ప్రమాదంలో పడిందని శేర్ నర్సారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నవంబర్ 1న చేపట్టే ' ఓటు బచావో - దేశ్ బచావో ' పేరుతో జరిగే ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి పిలుపునిచ్చారు.

ధాన్యం అమ్మకాలపై ఆందోళన వద్దు.. ప్రతి గింజను కొంటాం

-రైతులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

-రేణికుంట, మహాత్మానగర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 29 : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట,మహాత్మానగర్ గ్రామాల్లో పాక్స,ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ధాన్యం సేకరణకు అవసరాన్ని బట్టి మరిన్ని కేంద్రాలను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్న వడ్లకు బోనస్ తప్పకుండా అందజేస్తామని, ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని స్పష్టం చేశారు.ధాన్యం విక్రయించే సమయంలో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ

ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల సర్సయ్య, తహసీల్దార్ కె.శ్రీనివాస్ రెడ్డి, నుస్తులాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి, పోరండ్ల పీఏసీఎస్ చైర్మన్ గోపు తిరుపతిరెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు ఎలుక ఆంజనేయులు, పొన్నాల సంపత్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఎలుక రాజు, అంకూస్, కాంగ్రెస్ నాయకులు గంకిడి లక్ష్మారెడ్డి, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, పులి కృష్ణ, కుంట రాజేందర్ రెడ్డి,బుధారపు శ్రీనివాస్,కొత్త తిరుపతిరెడ్డి,రెడ్డిగాని రాజు, తమ్మనవేణి రాములు యాదవ్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, అయితం వెంకన్న,రాచపల్లి దుర్గాప్రసాద్,పోలు రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా మినీ స్కూల్ వ్యాన్ ఏర్పాటు

-సర్పంచ్ ఎలుక అంజనేయులు

చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 29 : తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపగా ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధి, సౌకర్యాల కల్పన, వారి ప్రయాణ ఇబ్బందుల పరిష్కారం కోసం సొంత ఖర్చులతో ప్రభుత్వ ప్రీ ప్రైమరి విద్యార్థుల కోసం మినీ స్కూల్ వ్యాన్ ను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరి విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు, తిరిగి ఇంటికి చేరుకునేందుకు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని,విద్యార్థుల చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, తల్లిదండ్రులకు ప్రయాణపరమైన ఇబ్బందులను తగ్గించేందుకు మరియు విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం,గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ మావంతు కృషి ఉంటూందని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి వార్డు సభ్యులు మరియు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సుజాత, మహేందర్,ఎలుక మమత ఆయా దాడి స్వరూప విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ

చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 29 : నిర్మల్ జిల్లా కేంద్రంలో శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ్ ఫైనాన్స్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 100మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ను అందజేశారు.విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో శ్రీరామ్ ఫైనాన్స్ రీజినల్ హెడ్ ఎన్. వినయ్ కుమార్,మేనేజర్ జి.నరేష్, కోఆర్డినేటర్లు రాము,వెంకటేష్‌తో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా మాజీ సర్పంచ్

చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 29 : వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒడ్డేపెల్లి లచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందగా,మాజీ సర్పంచ్ శ్రీ పోతుల నర్సయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.లచ్చమ్మచిత్రపటానికి నివాళులర్పించి,అంత్యక్రియల తక్షణ ఖర్చుల నిమిత్తం ఆమె కుమారులు సమ్మయ్య,కుమార్‌లకు రూ. 2,000ఆర్థిక సాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు అంబాల అనిల్, పైడిమల్ల శ్రీనివాస్,బొంగోని ఎల్లయ్య,అంబాల మధునయ్య,రాజయ్య పాల్గొన్నారు.

వైనాలను పరామర్శించిన ట్రాక్టర్ యూనియన్

చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 29 : కమాన్‌పూర్ ఏఎంసి చైర్మన్ వైనాల రాజు, హనుమకొండ ఏజీపీ వైనాల వినోద్ లను జూలపల్లి ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పరామర్శించారు. రాజు తండ్రి సాంబయ్య ఇటీవలే మృతి చెందగా సాంబయ్య చిత్రపటానికి యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాంబయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.పరామర్శించిన వారిలో పెరటి రామ్ రెడ్డి, అబెంగుల కొమురయ్య, ఆడెపు రమేష్, మొహమ్మద్ తాజ్, దండేపల్లి రవి, చొప్పరి చంద్రయ్య, పవన్, అబెంగుల ఓదెలు తతలు ఉన్నారు.

విద్యార్థులకు షూల పంపిణీ

-విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం : సర్పంచ్ ముడావత్ సరోజ చంద్రు నాయక్

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 29 : రాచర్ల గుండారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రభుత్వం అందించిన షూలను గ్రామ సర్పంచ్ ముడావత్ సరోజ చంద్రు నాయక్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెట్టి కిషన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు పద్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముడావత్ సరోజ చంద్రు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా విద్యాభివృద్ధిని ప్రోత్సహించవచ్చని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

చతుర్థి పూజలు అందుకున్న గణనాథుడు

- సంకటాలు తొలిగించే అంగారక చతుర్థి

చురకలు పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 29 : అశ్వయుజ మాసంలో శుక్లపక్షం గురువారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పురస్కరించుకొని గణనాథుని భక్తులు దర్శించుకున్నారు.చతుర్థి దీక్ష తీసుకునేవారికి శ్రీ గణనాథుని కరుణ కటాక్షంతో సంకటాలు తొలిగిపోతాయని ప్రగాఢ విశ్వాసం.అంగారక సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోదకులు,ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయి. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది. ఈ రోజున రాత్రి 8.40 గంటలకు చంద్రోదయం అనంతరం స్వామివారికి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయస్కారం.ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితం సుఖప్రదంగా కొనసాగుతుంది.సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోదకులు, ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయి.

ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేయించాలి

-ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి

-ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

చురకలు ప్రతినిధి,రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్..మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు,హౌసింగ్ ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా 6,465 ఇండ్లకు ముగ్గు పోశామని,5,479 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో,4,858ఇండ్లు గోడల లెవెల్లో, 4,585 స్లాబ్ లెవెల్లో,3,934 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ముగ్గు పోసిన వారితో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని,బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు,అక్కడి నుంచి స్లాబ్ లెవెల్కు,తుది దశ పనులు పూర్తి చేసేలా..ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలో గుడిసెల్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, త్వరితగతిన నిర్మాణ ప్రక్రియ మొదలు పెట్టాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కింద మంజూరు అయిన ఇండ్ల పై ఆరా తీసి..వాటి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఎంపీడీఓ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని సూచించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని,లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమావేశమై వేగంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని,ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా వివరించాలని ఆదేశించారు.మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఇండ్ల నిర్మాణాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఖాజా ముజాఫరుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లాలోని 07 ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు

-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 29 : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి, వారి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.జిల్లా పరిధిలో మొత్తం 07 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ. 1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ప్రమాదంలో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య చికిత్స అందేలా సహకరించాలని ప్రజలకు సూచించారు.ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని, ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు.అదేవిధంగా, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పై అవగాహన ఉండాలి

చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్ పూర్ అక్టోబర్ 29 : ప్రతి విద్యార్థికి పోలీస్ స్టేషన్పై అవగాహన ఉండాలి అని పోలీస్ శాఖ అధికారులు తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ అమర వీరుల త్యాగాలను గుర్తు చేస్తూ ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామగిరి మండలం పోలీసు స్టేషన్లో పోలీస్ ఫ్లాగ్ డే లో భాగంగా కల్వచర్ల గ్రామం లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన చేయడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు స్టేషన్ విధి, విధానాల గురించి, పోలీసు సిబ్బంది విధి నిర్వహణ గురించి మరియు వారి పిటిషన్ ఏ విధంగా తీసుకుంటారు, ఎఫ్ ఐ ఆర్ ఏ విధంగా నమోదు చేస్తారో ఆ ఇన్వెస్టిగేషన్ ఎలా చేస్తారు? కమాండ్ రూమ్ కంట్రోల్ గురించి, ఎస్ఐ విధుల గురించి, ప్రస్తుత యువతరం మొబైల్ అడిట్ అండ్ డ్రగ్స్ అడిక్షన్ గురించి దీని ద్వారా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు గురించి, డ్రగ్స్ కి అలవాటుకి దూరంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, విద్యార్థులు తప్పుదోవ పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సైబర్ క్రైమ్ అటాక్ నుండి ఎలా అప్రమత్తంగా ఉండాలో, సైబర్ క్రైమ్ కి గురైయితే గంటలోపు 1930 నెంబర్కు కాల్ చేయమని, అత్యవసర పరిస్థితుల్లో 112 నెంబర్ కి కాల్ చేయమని, ఒకవేళ పోలీస్ రికార్డుల్లో వాళ్ల పేరు నమోదు అయితే

భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యల గురించి దానికి అవగాహన కార్యక్రమం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం గురించి పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రామగిరి పోలీస్ వారి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్ , ఏ ఎస్ ఐ ఈదునూరి స్వామి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది తో పాటు కృష్ణవేణి స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు

శాశ్వత పరిష్కారం చూపేది బీజేపీ పాలకవర్గమే

-బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు

చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 29 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేది బీజేపీ పాలకవర్గమే అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్,మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. కరీంనగర్ నగరంలో గానీ, రాష్ట్రంలో గానీ భారతీయ జనతా పార్టీ ఎన్నడూ అధికారంలో లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గానీ, తెలంగాణ రాష్ట్రంలో గానీ బీజేపీ ఎప్పుడూ అధికారంలో లేదు. మరి అలాంటప్పుడు కరీంనగర్‌లోని డంప్ యార్డ్‌కు మూలకారణం ఎవరు? ఆ డంప్ యార్డ్‌ను అక్కడ సృష్టించింది ఎవరు? ఈ విధంగా నగరాన్ని దగా చేసింది ఎవరు? అనేది నగర ప్రజలు మొదటగా గమనించాలని యాదగిరి సునీల్ రావు కోరారు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీ, మరొకవైపు బీఆర్ఎస్ పార్టీలు ఇక్కడ మున్సిపల్ కార్పొరేషన్‌లో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయని, మరి ఆనాడు వారు ఎందుకు ఈ సమస్యపై చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.ఈ రోజు భారతీయ జనతా పార్టీ పాలకవర్గం ఏర్పడి 8 నెలలు కూడా కాకముందే మిగతా పార్టీల నాయకులు ఏది పడితే అది మాట్లాడటం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు.డంప్‌యార్డ్‌ను సృష్టించిందే ఆయా పార్టీల పాలకవర్గాలని,ఈ రోజు ప్రజలు నరకం అనుభవిస్తున్నారంటే, ఇబ్బంది పడుతున్నారంటే దానికి ఆనాడు అధికారంలో ఉన్న పాలకవర్గాలే పూర్తి కారణమని స్పష్టం చేశారు. అయినప్పటికీ,ఒక బాధ్యత కలిగిన పార్టీగా తమ పాలకవర్గం వచ్చి 9 నెలలు కాకపోయినప్పటికీ, ఎంపీ బండి సంజయ్ కుమార్ గారి నాయకత్వంలో ఈ డంప్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. బండి సంజయ్ ఆదేశాల మేరకు మేయర్, కార్పొరేటర్లు, పాలకవర్గం అంతా కలిసి అన్ని రకాల ప్రయత్నాలు చేశామని వెల్లడించారు.

రూ. 18 కోట్లతో బయో మైనింగ్ - టెండర్లు పూర్తి

రూ. 18 కోట్ల స్వచ్ఛ భారత్ నిధులతో బయో మైనింగ్ చేపట్టి, డంప్ యార్డ్‌లో ఉన్న చెత్త మొత్తాన్ని క్లియర్ చేయాలనే ఆలోచనతో టెండర్లు పిలిచామని, గత నెల 26వ తారీఖున టెండర్లు కూడా విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. మరో 10 రోజుల్లో వర్క్ ఆర్డర్ ఇస్తామని, అక్కడ ఉన్న డంప్ మొత్తాన్ని 9 నెలల నుండి ఏడాది లోపల పూర్తిగా క్లియర్ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని,ఇది చాలా గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు.

రూ. 80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్

అంతేకాకుండా, తదనంతరం రూ. 80 కోట్ల నిధులతో అధునాతన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రతిరోజూ వచ్చే చెత్తను రోజూవారీగా ప్రాసెస్ చేసి, భవిష్యత్తులో మళ్లీ డంప్ అనేది లేకుండా చూసి నగర ప్రజలకు ప్రశాంతమైన, పరిశుభ్రమైన, స్వచ్ఛమైన వాతావరణం (Clean Environmen̄t) అందిస్తామన్నారు. బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ పాలకవర్గం ఈ లక్ష్యంతోనే పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ధర్నాలు చేసే నైతిక అర్హత ప్రతిపక్షాలకు లేదు

ఈ విషయాలన్నీ తెలుసుకొని కొందరు 'ఆందోళనలు చేస్తాం, ధర్నాలు చేస్తాం' అని హడావుడి చేస్తున్నారని, అలా ఆందోళనలు చేయాలనుకునే వారు ముందుగా తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో ఆలోచించుకోవాలని సూచించారు. నాడు ఎలాంటి చర్యలు తీసుకోని వారికి ఈ రోజు ఆందోళనలు చేసే అర్హత గానీ, దీనిపై మాట్లాడే నైతిక అర్హత గానీ ఎంతమాత్రం లేదన్నారు.కేవలం 8 నెలల వ్యవధిలోనే దాదాపు రూ. 100 కోట్లు ఒక్క డంప్ యార్డ్ సమస్య కోసమే కేటాయించి, టెండర్లు కూడా పూర్తిచేసి బయో మైనింగ్ దిశగా ముందుకు వెళ్తున్న తమ పాలకవర్గం పనితీరును ప్రజలు గమనించాలని కోరారు. గతంలో కల్లబొల్లి మాటలు చెప్పి డంప్ యార్డ్ తీసుకొచ్చిన పార్టీలే, ఈ రోజు ముసుగులు వేసుకొని వచ్చి ధర్నాలు చేస్తామని నాటకాలు ఆడుతున్నాయని, ఇన్ని సంవత్సరాలు అధికారంలో ఉండి పట్టించుకోని వారి మాటలను ప్రజలు ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తప్పకుండా బండి సంజయ్ గారి నాయకత్వంలో బీజేపీ పాలకవర్గం కరీంనగర్ డంప్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చి తీరుతుందని యాదగిరి సునీల్ రావు ధీమా వ్యక్తం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్స్ వంగల పవన్,కొంపెల్లి రామణ్,బండారి వేణు, బండ రమణారెడ్డి,గాజ శివరాం, మేకల వెంకటేష్,కేఏపిపి చంద్ర,మాసం గణేష్,సోమిడి వేణు,పొన్నం మొండయ్య గౌడ్,గొట్టేముక్కల వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, చిగురు రవి, బిజెపి నాయకులు కటకం లోకేష్ కుమార్,బండి ప్రశాంత్,సత్తిరెడ్డి, వెంకటరెడ్డి, పండుగ నాగరాజు,అబ్దుల్ హమీద్,కుంభం అనిల్,అమీర్,అజ్జు, ఖాజా,ఫరూక్,మోతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో విద్యార్థులకు షూస్ పంపిణీ

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 29 : ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందించిన షూస్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు షూస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ పథకాలు దోహదపడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళా అభ్యర్థులను గెలిపించుకుందాం

- సామాజిక మహిళా న్యాయ వేదిక జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ

చురకలు ప్రతినిధి,వరంగల్ అక్టోబర్ 29 : రాబోయే వరంగల్- ఖమ్మం - నల్లగొండ శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మహిళా అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని సామాజిక మహిళా న్యాయ వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ డిమాండ్ చేశారు. టికెట్ సాధించిన మహిళా అభ్యర్థుల గెలుపుకోసం మహిళలందరూ ముందుండి ప్రచారం చేసి గెలిపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రేపల్లె స్వర్ణజ మాట్లాడుతూ... చట్టసభలు, శాసనమండలిలో మహిళల భాగస్వామ్యం, ప్రాతినిధ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పట్టభద్రులైన మహిళలు ఎమ్మెల్సీలుగా గెలిచినప్పుడే శాసనమండలిలో మహిళా లోకం గొంతుక బలపడుతుందని,మన ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమని వ్యాఖ్యానించారు.సమాజంలో మహిళల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పట్టభద్రులైన ప్రతి మహిళ తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. మహిళలు ఓటు హక్కును వినియోగించుకుని, తమ ప్రతినిధులను గెలిపించుకోవడం ద్వారా శాసనమండలిలో బలమైన గొంతుకగా నిలవాలని పిలుపునిచ్చారు.

నేడు రైతులకు పీఎం కిసాన్ సమాన్

చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ (పాలకుర్తి) అక్టోబర్ 29 : పాలకుర్తి మండలంలో 3724 రైతుల (ఒక్కో కుటుంబాలకు) ఈ విడత రూ: 2000 చొప్పున నేరుగా ఖాతా లో జమ చేయడం జరుగుతుంది అని పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు., శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడత నిధుల విడుదల కార్యక్రమం బనస్కాంత ప్రాంతం, గుజరాత్ రాష్ట్రంనుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చే నిధుల విడుదల కార్యక్రమం జరగనుంది.ఈ కార్యక్రమంలో భాగంగా 9.34 కోట్ల మంది రైతులకు ?18,690 కోట్ల నిధులు, 521 వ్యవసాయ మౌలిక సదుపాయాల యూనిట్ల జాతికి అంకితం చేస్తారు మరియు 12 ఉద్యానవన క్లస్టర్ల ప్రారంభోత్సవం రేపు జరగనుంది.అర్హత ఉండి పీఎం కిసాన్ రాని రైతులు, ఈ కేవైసీ భూమి వివరాలు, ఆధార్ లింక్ పై సందేహాలు ఉన్న రైతులు, లబ్ధిదారులు మరియు అభ్యుదయ రైతులు ఈ సమావేశానికి హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. కావున రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు మరియు పత్రికా మిత్రులు అందరూ తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరుతున్నాము.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పనిచేయాలి

-జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 29 : ప్రజా సేవలో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ప్రతి ఉద్యోగి బాధ్యతని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా అధికారులు పనిచేయాలని సూచించారు.విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ మహేందర్ రెడ్డి, సీఐ ప్రేమ్ పాల్గొని అవినీతి నివారణ, ఉద్యోగుల నైతిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. అవినీతి నివారణ ఒక్క శాఖ బాధ్యత మాత్రమే కాదని, అధికారులు, ఉద్యోగులు, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ప్రసూనాంబ అన్నారు. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించి మెరుగైన పాలన అందించాలని సూచించారు.అనంతరం అధికారులు, సిబ్బంది సమగ్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హుజురాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సమస్యలు పరిష్కరించండి

-ఆరోగ్యశాఖ మంత్రి "దామోదర" ను కలిసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

-వైద్యులు, నర్సుల ఖాళీలను వెంటనే భర్తీ చేయండి

-సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 29 : హుజురాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరతతో పాటు ఓపీ, స్కానింగ్ సేవల్లో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటున్నప్పటికీ, పలుమార్లు సమీక్షా సమావేశాల్లో సూచించినా పరిస్థితిలో మార్పు రావడం లేదని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

ప్రాంతీయ వైద్యశాలకు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వైద్యం కోసం వస్తుంటారని, ఓపీ సేవలు సక్రమంగా అందకపోవడం, స్కానింగ్ వంటి కీలక వైద్య పరీక్షల కోసం రోగులు ఇబ్బందులు పడటం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోతే పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడటంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బంది పనితీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

ప్రాంతీయ వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉంటేనే రోగులకు మెరుగైన వైద్యం అందించడం సాధ్యమవుతుందని, ఓపీ, స్కానింగ్ సేవలను మరింత మెరుగుపరిచి, అత్యవసర పరిస్థితుల్లోనూ రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఆసుపత్రిలో చోటుచేసుకున్న తాజా ఘటనతో పాటు సిబ్బంది పనితీరుపై ఉన్న ఫిర్యాదులను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపడేలా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ.. ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిబ్బంది, వైద్యుల పనితీరుపై దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని వివరించారు. వైద్యశాలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టేలా వైద్య సేవలను బలోపేతం చేయాలని, పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు.

వేతన సవరణ ఇంకెప్పుడు?

-టీ పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 29 : 2023 జులై 1 నుంచి ఉద్యోగులకు, పెన్షనర్ల కు రావాల్సిన తెలంగాణ రెండవ వేతన సవరణ కు ప్రభుత్వం కమిషన్ ను నియమించి 3 సంవత్సరాలు దాటినప్పటికీ అమలు కాకపోవడంపై తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.గురువారం జిల్లా అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా స్థాయి పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎల్ నినో నేపథ్యంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్న పరిస్థితుల్లో కొత్త పీ ఆర్ సీ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురు చూస్తున్నారని, మానవీయ కోణం లో ప్రభుత్వం అర్థం చేసుకొని 51 శాతం ఫిట్మెంట్ తో వేతన సవరణ కు ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథ్, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, ఉపాధ్యక్షులు పి. అశోక్ రావు,వి. ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు సత్యనారాయణ, ఎం. డి యాకుబ్, ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాధర్, కార్యదర్శి దుబ్బేశం,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు కె మురళి, మల్యాల అధ్యక్షులు రెవిన్యూ యాకూబ్, నారాయణ, కరుణ, విజయలక్ష్మి వివిధ మండలాల పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు విముక్తి

-మొదటి విడతగా 17 కోట్ల నిధులు మంజూరు

చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 29 : కరీంనగర్ నగరవాసులను దశాబ్ద కాలంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న డంపింగ్ యార్డ్ దుర్గంధం, కాలుష్య సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారదిశగా అడుగులు లభించింది. "డంపింగ్ యార్డ్‌కు ఇక బై.. బై.." అని చెప్పే రోజు రానే వచ్చింది.గతంలో కరీంనగర్ పర్యటన సందర్భంగా నగర ప్రజలకు ఇచ్చిన మాటను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నిలబెట్టుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నిరంతర కృషి, పట్టుదలతో ఈ సుదీర్ఘ సమస్యకు విముక్తి కోసం ముందడుగు డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాల తొలగింపు (బయో మైనింగ్), నగర పారిశుద్ధ్య ఆధునీకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ. 17 కోట్ల నిధులను మంజూరు చేసింది.

మాట నిలబెట్టుకున్న 'కమలం' పార్టీ:

కరీంనగర్ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కరీంనగర్ పర్యటనకు వచ్చిన సందర్భంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమస్య తీవ్రతను గ్రహించి, త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారమే స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ. 17 కోట్లు విడుదల చేయడంతో కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని కమలం పార్టీ నిలబెట్టుకుందని స్థానికులు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్ కోసం కోతిరాంపూర్ చౌరస్తాలో ఘనంగా సంబరాలు

దశాబ్దాల నాటి తీవ్రమైన రోగాల బారి నుండి, దుర్గంధం నుండి ఉపశమనం లభించనుండడంతో బిజెపి కార్పొరేటర్ మాసం గణేష్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ సమీపంలో వివిధ వర్గాల ప్రజలు, స్థానికులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ... కరీంనగర్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుందని నగరవాసులకు నరకం చూపించిన డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సహాయ పడిన కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ కుమార్,మరియు మేయర్ కోలగాని శ్రీనివాస్,నగరపాలక సంస్థ ప్రతినిధులకు,అధికారులకు, జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం స్వచ్ భారత్ మిషన్ కింద 17కోట్ల నిధులు మంజూరు కావడంతో బయో మైనింగ్ ప్రక్రియ శరవేగంగా పూర్తవుతుందని, రానున్న రోజుల్లో 80 కోట్ల నిధులతో డంపింగ్ యార్డ్ కు శాశ్వత విముక్తి లభించనుందని తెలిపారు.అతి త్వరలోనే కరీంనగర్ పరిశుభ్రమైన,ఆరోగ్యకరమైన సుందర నగరంగా మారడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

డంపింగ్ యార్డ్ విషయంలో బిఆర్ఎస్ ఇంకా రాజకీయాలు చేస్తున్నందుకు సిగ్గుండాలి...

డంపింగ్ యార్డ్ విషయంలో అనవసర రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి సిగ్గు ఉండాలని కార్పొరేటర్ మాసం గణేష్ ఘాటుగా విమర్శించారు. గత పదేళ్లు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని , కరీంనగర్ మూడుసార్లు ఎమ్మెల్యే , రాష్ట్ర మంత్రిగా పనిచేసిన గంగుల కమలాకర్ డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నందుకు సిగ్గుతో తలదించుకోవాలన్నారు.కరీంనగర్ డంప్ యార్డ్‌ను మరణ శాసనమ్ ల తయారు చేసింది ఎవరని? గత దశాబ్ద కాలంగా డంపింగ్ యార్డ్ సమస్య కోసం ప్రజలంతా శాశ్వతంగా పరిష్కారానికి మార్గాలు చూపమని కోరితే , కేటీఆర్ కెసిఆర్ వచ్చినప్పుడల్లా అర్ధరాత్రుళ్ళు అరెస్ట్ లు చేసి నియంత పాలన కొనసాగించారన్నారు.పార్టీ జెండాలు పక్కన పెట్టి ప్రజల అరోగ్యం, జీవితాన్ని కాపాడుకోవడానికి గత బిఆర్ఎస్ ను ప్రాధేయపడితే చేసింది ఏంటి.ప్రశ్నిస్తే గత బిఆర్ఎస్ నాయకులతో అక్రమ కేసులు పెట్టింది వాస్తవం కాదా..అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కృషితో ఇప్పుడు డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారమైతే చూసి ఓర్వలేక మళ్ళీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.. ఇకనైనా బిఆర్ఎస్ నేతలు పనికిమాలిన రాజకీయాలు మానుకొవాలనీ హెచ్చరించారు.నగర ప్రజల నమ్మకాన్ని బిఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని , ప్రజల నమ్మకంతోనే బల్దియా ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలిచారని,ప్రజలు బిజెపి పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుంటే జీర్ణించుకోలేని స్థితిలో బిఆర్ఎస్ ఉందన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ తన బుద్ధిని మార్చుకోవాలని హితవు పలికారు . ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర,తోట అనిల్,మ్యకల వెంకటేష్,మహిళలు బీజేపీ నాయకులు వివిధ డివిజన్ ప్రజలు , ఆటోనగర్ ప్రజలు, ఆటో యూనియన్ నాయకులు బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో

ఉచిత మెగా వైద్య శిబిరం

చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, అక్టోబర్ 29 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో గురువారం అస్త్ర కన్వెన్షన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిబిరంలో పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, స్థానికులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర పరీక్షలు నిర్వహించి, వివిధ విభాగాల వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సలహాలు అందించారు.కార్డియాలజిస్ట్ డా. ఆర్. సతీష్ కుమార్, గైనకాలజిస్ట్ డా. ఆర్. గౌరి లక్ష్మి, జనరల్ ఫిజీషియన్ డా. ఆర్. నాగరాజు, ఆర్థోపెడిషియన్ డా. సి. వేణుగోపాల్, జనరల్ సర్జన్ డా. అబ్దుల్ వారిస్ ఉస్మానీ, డైటీషియన్ జె. మమత, ఫిజియోథెరపిస్ట్ దౌలతాబాజీ అనిల్ తదితరులు వైద్య సేవలు అందించారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమానికి ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.